# సివంగి

సుమిత్రను ఫ్రెండ్స్ అంతా ముద్దుగ 'సివంగి' అనే నిక్‌నేమ్‌తో పిలుస్తూంటారు. ఎంతటి వారినైనా సరే సుమిత్ర లెక్కచెయ్యదు. 'రఫ్' ఆడించేస్తుంది. గులామ్ లాగ సలామ్ కొట్టే నేచర్ కాదామెది. ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా తాను ముందుంటుంది. కాలేజి లైఫ్‌లో కోర్కెల సాదనకోసం ఎన్నో సార్లు నిరసనలు నిరాహారదీక్షలు చేసి అనుకున్న కార్యాన్ని సాధించేది.

హాస్టల్లో వుంటైనే ఎడ్యుకేషన్ కమ్‌ప్లీట్ చేసింది. తాను షెడ్యూల్డ్ క్లాస్ స్టూడెంట్ అవటం సుమిత్రకు పెద్ద ప్లస్ పాయింట్ !. తిట్టి... తిరగబడి .... సాధించేది ఎంతటి అధికారనైనా ... నైతనైనా కలవటానికి వెనకాడేది కాదు.

ఆమె సాధించిన విజయాలు ఒకటా... రెండా? అనేకం!. అనేకానేక బహిరంగ పోరాటాల్లోనూ చురుకుగ పాల్గొనేది !. అణగారిన మహిళలకు ఎంతో సేవ చేసేది !... సాయం చేయటానికి వెనుకాడేదేకాదు.

లాఠీ దెబ్బలను లెక్కచెయ్యలేదు. జైలు జీవితాన్ని ఆనందంగ గడిపింది. మంచి ట్రేడ్ యూనియన్ లీడరనే పేరు సంపాదించుకుంది.

తండ్రి కూలీపని చేస్తూ ఎత్తైన ప్రదేశం మీదా నుంచి కిందపడి ఆకస్మికంగా మరణించాడు. కాంపెన్‌సేషన్ కొరకు కాంట్రాక్టర్ మీద యుద్ధం చేసింది. కోర్టుకెడతానంటూ బిల్డర్‌ను బెదిరించి. అప్పటికి సుమిత్ర ఇంటర్ చదువుతోంది. లేబర్ యాక్ట్ ప్రకారం పనిచేస్తుండగ అకాలమరణానికి గురైన తండ్రికి రావలసిన అయిదు లక్షల రూపాయలు కాస్తంత జాప్యం జరిగినా రాబట్టుకోగలిగింది.

ఆ డబ్బును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ వచ్చే ఆదాయం ఆమె తల్లి జీవనోపాధికి నెలనెలా వచ్చే ఏర్పాటు చేసింది.

తల్లికి రావలసిన వితంతు ఫించనుకోసం అధికార గణంతో పోరాడి సాధించింది. తన చదువు స్కాలర్‌షిప్‌తోనే కొనసాగించింది.

వచ్చే ఆదాయంతో బతుకు గడవటం దుర్భరమవటంతో నాలుగిళ్లల్లో యాదమ్మ సాచిపని చేయటానికి సిద్ధపడినప్పుడు... వద్దని వారించి తల్లికి నచ్చచెప్పింది. త్వరలోనే

తన చదువు పూర్తి కానున్నదని... త్వరలోనే వుద్యోగం వస్తుందంటూ తల్లికి ధైర్యాన్ని నూరిపోసింది.

టెన్త్‌లో సుమిత్ర స్కూల్ ఫస్టొచ్చింది. ఇంటర్‌లో ర్యాంకు సాధించింది. డిగ్రీలో స్టేట్ ఫస్టొచ్చింది !

ఉద్యోగం కోసం వేట మొదలైంది. అదొచ్చేవరకు కాళీగ వుండటానికి మనస్కరించక పదిమంది పల్లలను పోగేసి ట్యూషన్లు చెప్పటం ప్రారంభించిది !. పి.జి. చేయాలనే ఆరాటం సుమిత్రలో ఎక్కువైంది.

యాదమ్మ ఆరోగ్యం సన్నగిల్లింది. ఈ సమయంలో చదువు కోసం తాను పాకులాడి పే హాస్టల్లోనో వుంటే తల్లి సంరక్షణ ఎలా అనే ప్రశ్న వుత్పన్నమైంది.

పి.జి. చేశాక టీచింగ్ ప్రొఫెషన్లో సెటిలవ్వాలనేది ఆమె ఆశ !.

ఆస్పత్రిలో జాయిన్ చేసిన మూడవ రోజే తల్లి కన్నుమూసింది. యాదమ్మ చనిపోయిందన్న వార్త సుమిత్ర బంధువులకు తెలియచేసినా ఎవ్వరూ వచ్చిన పాపానపోలేదు.

కొడుకైనా కూతురైనా ఒక్కటే కాబట్టి ఇరుగు పొరుగు వారి సాయంతో తల్లి పార్థివ శరీరానికి అంత్యక్రియల కార్యక్రమం తానే స్వయంగ చేసింది.

తండ్రి తన చిన్నప్పుడే పోయాడు. ఉన్న ఒక్క తల్లీ శాశ్వతంగా దూరమైంది. ఇప్పుడు తాను వంటరి ! రేపు పి.జి. చేశాక మంచి జాబ్ వస్తే... తన సంరక్షణలో వుండేటందుకు కన్నవారు తనకు లేకుండా దూరమైనారనే బాధ సుమిత్రను కృంగదీసింది.

X X X

మరికివాడలో తల్లితో మండే పూరింట్లో వుండేటందుకు మనస్కరించక... సిటీలో ఒక పోర్షన్ మంచి లొకేలటీలో అద్దుకుతీసుకుంది.

డిపాజిట్ మీద వచ్చే డబ్బు స్కాలర్‌షిప్ డబ్బూ వస్తూండటంతో రెండేళ్ళ పి.జి. సునాయాసంగ పూర్తి చేయగలిగింది. రెండు సంవత్సరాల కాలం రెండు రోజుల్లో గడిచిపోయి నట్టనిపించింది సుమిత్రకు !

తాను ఆశించిన లెక్చరర్ పోస్ట్ రావటానికి మరికొంత సమయం పట్టేట్టున్నదన్పించటంతో... హాస్టల్ వార్డెన్ పోస్టకి కాంపిటీటివ్ ఎగ్జామ్ రాసి పాసైంది.

వెంటనే గరల్స్ గవర్నమెంట్ హాస్టల్ వార్డెన్‌గ జాబొచ్చింది. ఈ శుభ సమయంలో పేరెంట్స్ బతికి వున్నట్టయితే ఎంత సంబరపడి సంతోషించేవారో అన్పించిన సుమిత్ర నయనాలు గతం గుర్తుకొచ్చి చమర్చినయ్.

తన కింద పనిచేసే కుకింగ్ స్టాఫ్... క్లీనింగ్ అండ్ స్వీపింగ్ స్టాఫ్ అంతా స్త్రీలే కావటంతో వారితో నెగ్గుకురావటం కష్టమన్పించలేదు.

బియ్యం... పప్పు, ఉప్పు... నూనెలు వగైరా కొనటానికి ఇద్దరు వంటవాళ్లని వెంటబెట్టుకుని వెళ్లి తెస్తూవుంది సుమిత్ర.

హాస్టల్లో వుంటున్న ఆడపిల్లలకు ఏవిధమైన లోటు రాకూడదని వంటవాళ్లతో హెచ్చరించింది. పదార్థాలు రుచిగ శుభ్రంగ వుండేట్టు చూడమని చెప్పింది సుమిత్ర. పైఎత్తున వారు పర్యవేక్షిస్తూ ఆడపిల్లలను పరామర్శిస్తూ అందరిమన్ననలకు పాత్రురాలవుతోంది.

తనకూ వయసు మించిపోతోంది తల్లితండ్రీ లేని తన్లాంటి అనాధకు ఎవరు పెళ్ళిచేస్తారు? బంధువులంటూ పేరుకు వన్నారన్న మాటేగాని తన బాగోగులు ఎవరూ పట్టించుకన్న పాపానపోలేదు. తండ్రితల్లీ కాలం చేసినప్పుడే చుట్టాలంటూ ఎవరే వచ్చి ఓదార్చి సాయపడలేదు. అలాంటిది తన పెళ్లి గురించి శ్రద్ధ తీసుకునే వారెవరు?-

తానెవరినీ ప్రేమించటంలేదు. తాను అనాకారేం కాదు. తాను ఇష్ఠపడితే ఎవరైనా ముందుకురాకపోరు ! కానీ... ఈనాటి ప్రేమ వివాహాల గురించి సుమిత్రకు సదభిప్రాయంలేదు. మనుష్యుల మధ్య అనుబంధాలు... అనురాగాలు దూరమైపోవటం గమనిస్తోంది. వివాహ వ్యవస్తకు చెదపట్టిందని ఆమె అభిప్రాయం ! అభిమానించి ప్రేమించాల్సిన భార్యను అనుమానించటం... రాచిరపానపెట్టటం... కట్నం ఇచ్చినా... ఇంకా కావాలంటూ భర్తేకాక... అత్తమామల క్రూర ప్రవర్తనను... ముగ్గురూ ఏకమై పాశవికంగ భార్యగ ఇంటి కొచ్చిన ఆడపిల్ల ప్రాణాలను సైతం బలిగొనటం... వాట్ నాన్సెన్స్ ఆల్దిస్?... సొసైటీలో వ్యక్తుల ఆలోచన్లు వక్రమార్గ పడుతున్నందుకు బాధపడుతుంది. మహిళల పల్ల క్రూర ప్రవర్తన చూస్తూ సుమిత్ర మనసు బాదకు వ్యధకు గురవుతోంది. కట్టుకున్న భర్తను సైతం నమ్మశక్యం కాని రోజులివి !

హాస్టల్లో వున్న ఆడపిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తోంది. అక్కడున్న పల్లల్లో అంధులు...అవిటివారి సంఖ్యే ఎక్కువ ! వీకర్ సెక్షన్‌కు చెందిన వారి సంఖ్యే ఎక్కువ ! తండ్రిని కోల్పోయినవారు... కన్నల్లి దూరమైనవారూ వున్నారు. వారందరినీ తన తోడబుట్టిన వారిగ ప్రేమాభమానాలతో వారిఎలాంటి లోటు జరక్కుండా ఎంతో ఆప్యాయంగ చూచుకుంటోంది. పురుగు తుట్టె పట్టిన బియ్య ఇతరమైన ఆహారదినుసులు ఇస్తేండటం గమనిస్తే.. అంగడి వాళ్లను స్పేర్ చేయదు. వాళ్లను దబాయించేది. అధికారులకు రిపోర్ట్ ఇస్తానంటూ బెదిరిస్తుంది !

రైతుబజార్‌కు వెళ్ళి కాయగూరలు తాజాగ వున్నవాటిని తెచ్చి వంటవాళ్ళకు అంటించేది. రోజూ భోజనంలోకి కోడిగుడ్డు వుండేలా చూస్తోంది. వారానికోమారు... పర్వదినాల్లో స్వీటు ఏదైనా చేయంచేది విద్యార్థినుల కోసం!. హస్టల్ ప్రాంగణాన్ని... బాత్‌రూమ్‌ను... కిచన్ పరి శుభ్రత లోపిస్తే స్టాఫ్‌ను పిలిచి మందలించేది. చీవాట్లు పెట్టేది. సుమిత్రంటే అక్కడ పనిచేసే వారందరికీ హడలే !. పిల్లలతో మాత్రం అభిమానంతో ప్రేమతో వ్యవహరించేది. అప&ఉడప్పుడు హాస్టల్లో వున్న పిల్లలకు తలదువ్వటం... తలకు చూనె రాయటం వంటి పన్లూ చేస్తూంటుంది.

మేడమ్... మేడమ్... అంటూ పిల్లలంతా తనను చుట్టుకు తిరుగుతూంటే సుమిత్ర ఆనందంతో పరవశించేది. తన వునికిని తాను మరిచేది.

ఇన్స్పెక్షన్‌కు పై అధికారులెవరైనా వచ్చినప్పుడు హాస్టల్లో వుండే గరల్ స్టూడెంట్స్‌ను... వారి శుభ్రతను.. పరిసరాల శుభ్రతను... పిల్లల డిసిప్లిన్ చూచి అబ్బురపడేవారు. సరుమిత్ర నిర్వహణ సామార్థ్యాన్ని కొనియాడేవారు. వార్డెన్స్ అంతా ఆమెలావుండాలని... సుమిత్ర మిగతా వారికి రోల్ మోడల్ కావలని శ్లాఘిస్తూండేవారు.

తాను మొబైల్ కొనుక్కుంది. అవసరమైనప్పుడు తనపై అధికారులను మొబైల్లో సంప్రదించి వారి అనుమతి తీసుకుని వ్యవహరిస్తూ.... విషయాలపట్ల కాలయాపనకు తావిచ్చేదేకాదు.

X X X

ఆఏటి బెస్ట్ వార్డెన్ అవార్డు అందుకున్నది సమిత్ర ! ఇది జరిగిన మూడవ రోజున మినిస్టర్ పి.ఏ. ఫోన్ చేసి 'మంత్రిగారు మీ హాస్టల్ ఇన్స్పెక్షన్‌కొస్తున్నారు.

జాగ్రత్తగ వుండండి.' అంటూ న్యూస్ సుమిత్ర చేవినేశాడు.

ఇంకేముంఇ సుమిత్రతో పాటు అక్కడికి వర్కర్స్ అందరికీ చేతినిండా పనే ! రంగుకాగితాలు... తగరం పేపర్స్ తెప్పించి వాటిని వివిధ రూపాల్లో కత్తిరించి హాస్టల్ గదులన్నింటిలో అలంకరించింది !. నేతల ఇతర ప్రముఖుల ఫోటోలు తడిపించి కొత్త దండలు తెప్పించి వేసింది. తను కూర్చుండే ఆఫీసురూమ్ లో గల బుక్స్... మేగజైన్స్... న్యూస్ పేపర్స్ ను ర్యాక్స్‌లో నీట్‌గ ఏర్పాటు చేసింది. సీలింగ్ ఫాన్ దుమ్మును దులిపించింది.

ఆరోజు పగలంతా మంత్రిగారి రాకకోసమే కళ్లలో వత్తులేసుకుని స్టాఫంతా నిరీక్షించారు. ఆలస్యానికి గల కారణం తెల్సుకుందామని పి.ఏ. కి ఎన్నిసార్లు మొబైల్ ద్వారా ప్రయత్నంచినా 'స్విచ్ ఆఫ్' అనే టేప్ వాయిసే విన్పించింది.

రాత్రి పదిగంటలవుతున్నా మినిస్టర్ రాకపోవటంతో ప్రోగ్రాం కేన్సిలైందేమోని స్టాఫంతా వెళ్లిపోయారు. పిల్లలు భోజనం చేసి నిద్రపోయారు.

తన ఆఫీసుగదిలో వంటరిగా సుమిత్ర వక్కతే ఫోన్ మెసేజ్ కోసం నిరీక్షిస్తోంది. ఇంతలో కారు హాస్టల్ కేంపస్‌లోకి రావటం చూచి తనగదిలోంచి బైటికొచ్చి నిలబడింది.

ఆగిన కార్లోంచి మంత్రివర్యులు ఆయనగారి పర్సనల్ సెక్రెటరీ దిగటం చూచి వడివడిగ వారికి ఎదురెళ్లి సమస్కరించి ఆహ్వానం పలికింది.

'ఇప్పటిదాకా స్టాఫ్ తమకోసం నిరీక్షంచి ఇంతకుమందే వెళ్లిపోయారు... పిల్లలు కూడా భోజనం చేసి నిద్రపోయారు అంది వారి వెంట నడుస్తూ సుమిత్ర.

'సారీ లేటైంది కాన్ఫరెన్స్ ముగిసే సరికి ఈవరైంది...'

'రండి, నా ఆఫీసు గది చూద్దురు గానీ... అకాలమైనా.. మీ డిన్నర్ హాట్‌పేక్‌లో పెట్టించి వుంచాను. మీరొస్తున్నారని చికెన్... ఫిష్... ఫ్రాన్స్... తెప్పించి కర్రీ ప్రిపేర్ చేయించాను....'

'గుడ్ ! వెరీగుడ్... ! అన్నట్లు - బెస్ట్ వార్డెన్ మెడల్ వచ్చింది నీకే కదూ...? మంత్రి అడిగారు.

'యస్ సార్... నాపేరు సుమిత్ర... ఎమ్మెస్సీ చేశాను....'

'హాయిగ లెక్చెరర్‌గ స్థిరపడక... ఈ జాబెందుకు చేస్తున్నట్లు' మరో ప్రశ్న దిక్కులు చూస్తూ సంధించారు మంత్రివర్యులు !

'మేడమ్ ! మినిస్టర్ గారు 'స్టే' ఇక్కడే... అరేంజ్‌మెంట్స్ చేయండి.' పి.ఏ. విషయం వివరించాడు.

అదేంటి? మంత్రిగారివంటి వ్యక్తి హాస్టల్లో స్టే చేయడమేంటి అని విస్తుబోయింది సుమిత్ర!

ఏనీవే... ఇన్స్పెక్షన్లో భాగం కాబోలిది అని సరిపెట్టుకుంది.

'మీకు ఇబ్బందేం లేదుసార్. సపరేట్ రూముంది. అదీ శుభ్రం చేయించివుంచాను. ఫ్యానుంది. రెండు కాట్స్... డన్లప్ బెడ్స్ కూడా.వున్నయ్. మీరు ఎలాంటి అసౌకర్యం లేకండా అక్కడ వుండవచ్చు. అకాలమైంది... హాట్ ప్యాక్స్ ప్లేట్సు స్ఫూన్స్ ఫోర్క్స్ మీ రూమ్‌లో వుంచుతాను. కూజాలో డ్రింకింగ్ వాటరు గ్లాసులు కూడా వున్నయ్ గదిలోనే...' పాఠంలాగ వల్లించింది సుమిత్ర.

వీళ్లకు సేవతోనే సరిపోతుంది. తెల్లవార్లూ నిద్రకు నోచుకోను కోబోలు అనుకుంది మనసులో.

పి.ఏ. ముందు మినిస్టర్ వెనుకగా రెస్ట్ రూమ్‌లోకి నడిచారు. వెంటనే హాట్‌పాక్స్ ఇతరమైన వస్తువులు తెచ్చిపెట్టి 'నన్ను సర్వ్ చేయమంటారా అని అడిగింది.

'అవసరంలేదు నువ్వు ఇంటికెళ్లిపోవచ్చు. పి.ఏ. వున్నాడుగా పన్లన్నీ అతనే చూచుకుంటాడు...'

మంత్రి నిర్ణయం విన్న సుమిత్ర వెనుతిరిగి తన రూమ్‌లోకొచ్చి ఛైర్లో రిలాక్సైంది. రూమ్‌లో పెట్టించుకున్న భోజనం ముగించింది. ఇంటికివెళ్లబుద్ధి కాలేదు. మంత్రిగారు ఇక్కడ స్టే చేసి వుండగ తాను ఇంటికెళ్లటం బాగుండదన్పించటంతో కుర్చీలోనే కునికిపాట్లు పడసాగింది.

అనుకోకుండా చప్పుడు విన్పించటంతో సుమిత్ర వులికిపడి మేల్కొంది. ఏమైవుంటుందాని లోనికెళ్లింది. మంత్రిగారు తలుపు ఓరగా తీసివుంది. దగ్గరగా వెళ్లి సందులోంచి లోనికి చూసింది. తలుపు బైట వున్న సుమిత్ర నాసికాపుటాలకు బ్రాందీ వాసన గుప్పున కొట్టింది.

గరల్స్ హాస్టల్ ఇన్స్పెక్షనికొచ్చిన మినిస్టర్ ఇక్కడ దుకాణం తెరవటమేంటని విసుపోయింది. తలుపు తోసుకొని లోనికెళ్ళింది పి.ఏ. అవుపించలేదు.

'రావే లేడీరా!... మా పి.ఏ.ను మరో బాటిల్ తెమ్మని పంపాను. ప్రస్తుతం నేను

సింగిలే ! - నీకూ పెళ్లి కాలేదు కదూ... ఇంకేం... ఇద్దరం ఎంజాయ్ చెయ్యొచ్చు... కమాన్ డియర్. వచ్చి నా కౌగిట్లో వాలితే ఈ బోడి వుద్యోగం మాన్పించి నీకు గవర్నమెంట్ కాలేజీలో లెక్చరర్ పోస్ట్ ఇప్పిస్తాను కమాన్...' అంటూ సుమిత్ర మీదికొచ్చాడు. సింహం నోట్లోకి లేడిపిల్ల చిక్కినట్టయింది. అమాంతం సుమిత్రను తన కౌగిట్లో బంధిచాడు.

కౌగిలి విడిపించుకొని కిచన్లోకెళ్లిన సుమిత్ర అక్కడున్న కత్తిపీట అందుకుని సివంగాలా మంత్రి మీదికురికింది. ఒక్కవేటుతో పీక తెగి నెత్తురు కారటంతో మంత్రి నేలకూలి... రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకుని ప్రాణాలు విడిచాడు.

సుమిత్ర ఏమాత్రం భయపడలేదు. బెదిరిపోలేదు. అక్కడ్నించి తప్పించుకోవాలనే ప్రయత్నం చేయలేదు. పారిపోలేదు. ఒక దుష్టుడిని... దుర్మార్గుడిని... రాక్షసుడిని... చంపి సరైన శిక్ష వేసినందుకు వెర్రిగ నవ్వింది. కసితీరా నవ్వింది !

వెంటనే పోలీసు స్టేషన్‌కు ఫోన్ చేసి జరిగింది చెప్పింది సివంగిలాంటి సుమిత్ర !

సుమిత్రకు బేడీలు పడ్డయ్ ! పోలీసు జీపు ఎక్కించారు !.

--- సమాప్తం ---